క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకట రత్నం

యల్లనూరు: మండలవ్యాప్తంగా వేసవి కాలంలో జరిగే ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని తాడిపత్రి క్లస్టర్ ఏపీడీ వెంకట రత్నం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బంది, కూలీలతో సమావేశం నిర్వహించారు. కూలీలు ఎవరూ వలస వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పిస్తామన్నారు. పండ్ల మొక్కలను పెంచడంతో పాటు వంద శాతం మొక్కలను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ షబ్బీర్ బాషా, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోడెదూడకు మూత్రశయ శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేస్తున్న వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్. పద్మనాభం

శింగనమల: స్థానిక పశువైద్యశాలలో ఏడీ డాక్టర్. పద్మనాభం కోడెదూడకు శస్త్ర చికిత్స చేశారు. గుమ్మేపల్లికి చెందిన రైతు ఓబిరెడ్డికి చెందిన కోడెదూడకు మూత్రం రాకపోవడంతో రైతు దూడను బుధవారం స్థానిక పశువైద్యశాలకు తీసుకొచ్చారు. దూడకు పరీక్షలు నిర్వహించిన ఏడీ డాక్టర్. పద్మనాభం మూత్రనాళంలో రాళ్లు అడ్డుపడుతున్నాయని, గుర్తించి శస్త్ర చికిత్స చేశారు. పశువులకు ఏమైన జబ్బులు చేస్తే, వాటిని తీసుకొని రావాలని, అవసరమైతే శస్త్ర చికిత్స చేస్తామని డాక్టర్.పద్మనాభం తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఆర్‌పీ పోలీసులు

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్‌పీ సీఐ నగేష్ బాబు, ఎస్‌ఐ నాగప్ప ఆధ్వర్యంలో ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. ఈసందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు.

ఘనంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జన్మదినం



చైర్‌పర్సన్ భవానికి కేకును తినిపిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్. భవాని జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్‌నగర్ ఫంక్షన్ హాల్, బీరప్పగుడి ఆవరణలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భవాని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్, కౌన్సిలర్‌లు లింగన్న, జింకల సుజాత, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున శాస్త్రీ, దశరథరెడ్డి, శేఖర్, గోవింద్‌నాయక్, ఖలీల్, నవీన్, మహదేవ, సాంబ, హాజీ, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



పెనకచెర్లలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గార్లదిన్నె: ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని పోలీసు అధికారులు ప్రజలను కోరారు. బుధవారం యర్రగుంట్ల, పెనకచెర్ల, పెనకచెర్ల డ్యాం గ్రామాల్లో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ దళాలు కవాతు నిర్వహించాయి. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.

తోడుగా ఉంటా.. అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు



బండ్లపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. వీరాంజనేయులు



దుర్గంలో వీరాంజనేయులుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నార్పల: జగనన్న అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలందరికీ తోడుగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఆయన దుర్గం, సిద్ధరాచర్ల, బోయకొట్టాల, గొల్లపల్లి, మాలవాండ్లపల్లి, కమ్మకొట్టాల, బండ్లపల్లి గ్రామాల్లో మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ముందుగా వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే గ్రామస్తులు, కార్యకర్తలు బాణాసంచా పేలుస్తూ, డప్పు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని గడప గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మీ కుటుంబానికి మంచి జరిగింటేనే జగనన్నకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్య,వైద్య రంగాలను ఉన్నత స్థాయిలో నిలిపేందుకై పక్కా ప్రణాళికతో ముందుకు సాగారన్నారు. ప్రతి నిరు పేద కుటుంబం విద్య కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయకూడదని, అప్పుల పాలు కాకూడదనే తలచి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకాలు తీసుకురావడమే కాక విద్యార్థి వేసుకునే యూనిఫాం నుంచి పుస్తకాల వరకు అన్ని ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఆంగ్ల భాషను పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు అందించడం ఎంతో మంచి నిర్ణయమన్నారు. వైద్య రంగంలో కూడా ఒక విప్లవాత్మక మార్పు తెచ్చారన్నారు. ప్రతి పంచాయతీలోనూ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేయడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంచారన్నారు. వీటితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉన్నారన్నారు. కానీ ప్రతి పక్షాలు, పచ్చ మీడియా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వాంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న చేసిన మంచిని గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరో మారు ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, నాయకులు మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి,



ఎస్సీకాలనీ పిల్లలతో వీరాంజనేయులు మాటామంతి

పురషోత్తంరెడ్డి, పుల్లన్న, రాజారెడ్డి, రవి, దాము, నారాయణస్వామి, దాసయ్య, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, దేవా, ఆది,రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లపల్లి ఎస్సీ కాలనీలో పల్లె నిద్ర..

అనంతరం బండ్లపల్లి ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు, గ్రామస్తులతో వారి సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ రాగానే తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారులతో ముచ్చటించారు.

నేడు వీరాంజనేయులు పర్యటన..

యల్లనూరు: మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా గురువారం వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం. వీరాంజినేయులు పర్యటిస్తున్నట్లు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 7.30గంటలకు యల్లనూరు మండలం నీర్జాంపల్లి నుంచి ప్రచారం ప్రారంభమై లక్షుంపల్లి, దంతలపల్లి, గడ్డంవారిపల్లి, లింగారెడ్డిపల్లి, మల్లాగుండ్ల గ్రామాల్లో సాగుతుందన్నారు. గడ్డంవారిపల్లిలో ఆయన పల్లె నిద్ర చేస్తారన్నారు.

తాగునీటి సమస్యపై కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే ప్రత్యేక కమాండ్ కంట్రోల్ నంబర్లలో 08552291088, 9494096427(జిల్లా కమాండ్ కంట్రోల్) సంప్రదించాలని సూచించారు.

గుంతకల్లుటౌన్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని నీటి సమస్యల పరిష్కారానికై మున్సిపల్ కార్యాలయం నందు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటరమణయ్య, ఎంఈ గురప్పయాదవ్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డులో నీటి సమస్యలు, పైప్‌లైన్ లీకేజీ సమస్యలుంటే 08552 226726, 96429 12127 నెంబర్లకు ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు

వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యల్లనూరు: మండల కేంద్రంలోని వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వేరుశనగ వామి దగ్ధం



మంటల్లో కాలిపోతున్న వేరుశనగ పొట్టువామి

గుంతకల్లు రూరల్: మద్యానికి బానిసగా మారి దొంగతనాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు మంగళవారం రాత్రి ఓబుళాపురంలో రైతు సుంకిరెడ్డికి చెందిన వేరుశనగ పొట్టువామికి నిప్పు పెట్టారు. మంటల్లో రెండు పొట్టువామిలు పూర్తిగా కాలి బూడిద కావడంతో సుమారు రూ. 1.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు సుంకిరెడ్డి వాపోయారు. బాధితుడి సమీప బంధువులు అయిన సుధాకర్, గురుప్రసాద్ మద్యానికి బానిసగా మారి వారి తాగుడు కోసం గ్రామంలో రైతుల బోర్ల వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్‌లు ఇతర వ్యవసాయ పరికరాలు ఎత్తుకెళ్లేవారు. గతంలో బాధిత రైతు సుంకిరెడ్డికి చెందిన వ్యవసాయ పరికరాలు కూడా దొంగలించారు. దీంతో సుంకిరెడ్డి వారిని మందలించారు. అతడిపై కక్ష్య పెంచుకున్న ఇద్దరు యువకులు మంగళవారం రాత్రి సుంకిరెడ్డికి చెందిన వేరుశనగ పొట్టువామికి నిప్పుపెట్టారు. అటుగా వెళ్తున్న కొందరు రైతులు సుధాకర్‌ను వెంబడించి పట్టుకోగా, మరో యువకుడు గురుప్రసాద్ పారిపోయాడు. మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో గడ్డివామి పూర్తిగా కాలి బూడిదైంది. సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్న కసాపురం పోలీసులు గురుప్రసాద్ కోసం గాలిస్తున్నారు.

గార్లదిన్నె: మర్తాడులో బుధవారం జరిగిన నిప్పు పెట్టడంతో గడ్డివాము దగ్ధమైంది. స్థానికుల తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నీలమ్మ దొడ్డిలో వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయింది. ఘటనలో రూ.20 వేలు నష్టం వాటినట్లు బాధితురాలు వాపోయింది.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయడమే లక్ష్యం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైపీ బాబు, పాస్టర్లు

గుత్తి: క్రిస్టియన్ సమాజమంతా సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని, మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేయడమే తమ లక్ష్యమని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు అన్నారు. పట్టణంలోని వైపీ బాబు బుధవారం పలువురు పాస్టర్లతో కలిసి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాస్టర్లు, పెద్దలు, మేధావుల ఇళ్లకు వెళ్లి సీఎంకు అండగా నిలవాలని అభ్యర్థించారు. ఏపీకి జగనే ఎందుకు కావాలో తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. మరోసారి సీఎంగా జగన్‌ను ఆదరించాలని, గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డి ని కూడా మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోసారి జగన్‌ను సీఎంను చేయడానికి శక్తి వంచన లేకుండా సైనికుల్లా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ టౌన్ చర్చి పాస్టర్ జె.సాల్మన్, పాస్టర్లు వాసు అనిల్ కాంత్, డేవిడ్ నాయక్, అబ్రహం, జాకబ్, అబ్రహామయ్య, సాల్మన్, వైఎస్ బాబు కిరణ్ దీప్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మరోసారి పట్టం కట్టండి

- కూటమిలెన్ని కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం
- సోలార్ గ్రిడ్ ఏర్పాటు కాగానే స్థానిక యువతకు ఉపాధి
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్న సంక్షేమసారథి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రజలను అభ్యర్థించారు. బుధవారం పట్టణంలోని 3,4,7,8,26,9,10,25 వార్డుల్లో వైఎస్సార్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన సమావేశాలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక కాబోతుందని వ్యాఖ్యానించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే మాత్రం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని మోసపూరిత హామీలిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన వర్గాల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు యథావిధిగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

సోలార్‌గ్రిడ్ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి

గుంతకల్లు పరిసర ప్రాంతాల్లో అతి త్వరలో రూ.1000 కోట్లతో ఏర్పాటు కానున్న సోలార్ గ్రిడ్ ద్వారా స్థానికంగా ఉన్న సుమారు 3 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే వైవీఆర్ స్పష్టం చేశారు. తాను సీఎం జగన్‌తో పట్టుబట్టి సోలార్‌గ్రిడ్‌ను గుంతకల్లుకు మంజూరు చేయించానని, వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు షురూ చేయిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో చేసి చూపామన్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉంది కాబట్టే టీడీపీ పార్టీ అభ్యర్థిని నిలబెట్టేందుకు వెనకడుగేస్తుందన్నారు. తనకు ప్రత్యర్థిగా ఎవ్వరొచ్చినా తగ్గేదేలె అని, గతేడాది 49 వేల మెజార్టీ వచ్చిందని, ఈ సారి దానికంటే ఎక్కువ రావడం ఖాయమన్నారు.

బాబుకు ఊడిగం చేయడమే పవన్ లక్ష్యం..

చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీల కోసం కక్కుర్తి పడుతున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నైతిక విలువలు, సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి చంద్రబాబుకు ఊడిగం చేయడానికి సిద్ధమయ్యారంటూ ఎమ్మెల్యే వైవీఆర్ నిప్పులు చెరిగారు. ప్యాకేజీ స్టార్‌కు జెండా, అజెండా లేవన్నారు. సుపరిపాలనలో దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన సీఎం జగన్‌ను అధఃపాతాళానికి తొక్కుతానంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. కౌన్సిలర్లు జింకల సుజాత, గంగమ్మ, అరుణ, లింగన్న, విజయలక్ష్మి, రవీంద్ర, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, పార్టీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, వార్డు ఇన్‌ఛార్జ్‌లు శేఖర్, బట్నాపాడు సుంకప్ప, ఎద్దుల శంకర్, మహదేవ్, హాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పోలింగ్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

వ్యవసాయానికి జగనన్న వెన్నుదన్ను



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖరరెడ్డి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి సమున్నత స్థానం కల్పించి రాష్ట్ర వ్యాప్తంగా 10,500 రైతు భరోసా కేంద్రాలు, 150 అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లు, మల్టీ పర్పస్ గోడౌన్లు, జలకళ ద్వారా ఉచితంగా బోర్లు, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నేమతాబాద్ గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గత ఐదేళ్లలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్, రైతులకు పంటల బీమా, హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల పంపిణీ వంటి అనేక పథకాలు అమలు చేశారన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, నేల పరీక్షలు గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో చేశారన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు నిర్మించారన్నారు. శ్రీశైలం నుంచి 90 వేల క్యూసెక్కుల కృష్ణ జలాలను తరలించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి చేశారన్నారు. ఎప్పుడూ లేని విధంగా సీఎం జగన్ రూ.1,500 కోట్లకు పైగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి రైతులను ఆదుకున్నా రన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను ఇచ్చి రైతులను ఆదుకున్నారని ఆయన అన్నారు. రైతులకు అండగా నిలిచిన జగనన్నను మరోసారి ఓట్లేసి గెలిపించాలని కోరారు. మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ రామరంగారెడ్డి, సభ్యుడు గోపాల్‌రెడ్డి, ఐటీ వింగ్ సభ్యులు జ్ఞానేశ్వర్, నారాయణ పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిద్దాం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం చందన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే పేదల జీవితాలు మెరుగుపడతాయన్నారు. గతంలో పేదలు సంక్షేమ పథకాలు పొందాలంటే ముందుగా జన్మభూమి కమిటీ సభ్యులు ఆమోదం పొందాలని కానీ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సర్పంచులు సంజీవరాయుడు, పద్మనాభరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ శివ, నాయకులు ఆదిరంగారెడ్డి, వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు శివకేశవరెడ్డి, నాగరాజు, కోనా జగదీశ్వర రెడ్డి, బాలగంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



గార్లదిన్నెలో ప్రచారం చేస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

పెద్దపప్పూరు: సంక్షేమపథకాలు కొనసాగాలంటే జరగబోవు ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలుపించుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం గార్లదిన్నెలో ఆయన పర్యటిచారు. అనంతరం సాయిప్రతాప్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతో పాటు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని గ్రామస్తులకు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, సర్పంచు హేమసుందర్ రెడ్డి, ఉపాధిహామీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, జేసీఎస్ కన్వీనర్ పెద్దిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, స్థానిక నాయకులు కమలాకర్‌రెడ్డి, ఆలూరు నారాయణరెడ్డి, కేశవరెడ్డి, నామనాంకపల్లి రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

తొండపాడు హుండీ ఆదాయం రూ.15.72 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు ద్వారా రూ.15,72,883 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రాణి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో శాశ్వత హుండీలను లెక్కించారు. 2023 సెప్టెంబర్ 22 నుంచి బుధవారం వరకూ హుండీలలో భక్తులు వేసిన నగదును లెక్కించగా పై ఆదాయం లభించింది. గ్రూప్ టెంపుల్ అధికారి నాగేంద్రుడు, ఆలయ సిబ్బంది, గుంతకల్లు హనుమాన్ సేవాసమితి సభ్యులు, అర్చకులు రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

1 నుంచి పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీవివేకానంద ఎంబీఏ కాలేజీలో ఏప్రిల్ 1 నుంచి పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశపరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్విస్ కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 97055 55449, 99638 76741 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సజావుగా 'పది' పరీక్షలు

పెద్దవడుగూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీసరస్వతి హైస్కూల్‌లో బుధవారం టెన్త్ పరీక్షలు సజావుగా జరిగాయి. సోషల్ పరీక్షకు రెండు కేంద్రాల్లో 629 మందికి 584 మంది హాజరైనట్లు ఎంఈఓ రాముడు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పామిడి: మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం సోషల్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆయా కేంద్రాల్లో మొత్తం 851 మందికిగాను 780 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

యాడికి: దాడి కేసులో పోలీసులు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. వివరాలు..భోగాలకట్ట గ్రామంలో ఈ నెల 3న దూదేకుల బాబయ్యపై అదే గ్రామానికి చెందిన యంపలాకు ప్రతాప్, యంపలాకు శివకృష్ణ, విశ్వనాథ్, నాగవేణి, మల్లేశ్వరీ దాడి చేయడంతో వారిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. బాబయ్యపై దాడికి పాల్పడిన ఐదుగురిని బుధవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజపర్చారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: నిట్టూరు శివారులో బుధవారం నాటుసారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన నల్లబోతుల రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం తాడిపత్రి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డు బైపాస్‌లో మద్యం విక్రయిస్తున్న యల్లనూరు వాసి జిలాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ ఫణీంద్ర తెలిపారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గుత్తి: దంతాలను రోజూ రెండు సార్లు శుభ్రం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, దంత వైద్యురాలు ప్రశాంతి విద్యార్థులకు సూచించారు. జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో బుధవారం మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం

పుట్లూరు: సూరేపల్లికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా ఈనెల15న తాడిపత్రికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంత అతడి భార్య రమీజా తెలిసిన చోటల్లా గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



ధీరజ్ అభిమన్యురావ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు చదువులతో పాటు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏఏఎన్‌ఎస్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ అభిమన్యురావు పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ క్రిటికల్ థింకింగ్ ద్వారా విద్యార్థులకు సానుకూల దృక్పథం పెంపొందించడంపై వర్క్‌షాప్ నిర్వహించారు. మెకానికల్ విభాగానికి చెందిన 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధీరజ్ అభిమన్యురావు మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. జీవితంలో వివిధ కోణాల్లో సానుకూల మనస్తత్వాన్ని కొనసాగించడంతో కలిగే ప్రభావాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ అంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.